మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం

కాంగ్రెస్ పార్టీది రక్తచరిత్ర

- సీఎంను మార్చేందుకు 400 మందిని బలితీసుకున్న పార్టీ అది..
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ హత్యాయత్నం హేయం
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం

భద్రాచలం, అక్టోబర్ 31: రక్తచరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ అనే విషయం ప్రజలందరికీ తెలుసునని, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ తెలిపారు. బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త హత్యాయత్నానికి పాల్పడ డాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. భద్రాచలంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు, పార్టీ మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావుతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత సంస్కృతిని ఈ ఎన్నికల్లో మొదలుపెట్టిందని విమర్శించారు. ఓటమి భయంతోనే నిరాశకులోనై కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. 1991లో ముఖ్యమంత్రిగా ఉన్న మర్రి చెన్నారెడ్డిని గద్దె దించడానికి మతకల్లోలాలకు కారణమై 400 మందిని పొట్టన పెట్టుకున్నది కాంగ్రెస్ పార్టీ అన్న విషయం ప్రజలు మర్చిపోలేదని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తాండ్ర రమణారావు, దుద్దుకూరి సాయిబాబా, నర్రా రాము, తాళ్లపల్లి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అమలుతో..

పేదల జీవితాల్లో వెలుగులు

- శ్రేణులు పార్టీ బలోపేతానికి, బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి
- బీఆర్ఎస్‌లో చేరికలో సభలో అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా

బీఆర్ఎస్‌లో చేరిన జనసేన నాయకులతో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట, అక్టోబర్ 31: తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉందని అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంతేగాక, అన్ని వర్గాల ప్రజలకూ ఆమోదయోగ్యంగా ఉందని, మరిన్ని సంక్షేమ పథకాలకు మార్గం చూపుతోందని అన్నారు. అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దమ్మపేట మండల కేంద్రంలోని జనసేన పార్టీకి చెందిన 11 కుటుంబాల వారు మంగళవారం బీఆర్ఎస్ చేరారు. మండలంలోని తాటి సుబ్బన్నగూడెంలోని తన నివాసంలో వారందరికీ ఎమ్మెల్యే మెచ్చా గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చూసే వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని అన్నారు. మ్యానిఫెస్టో అమలుకావాలంటే ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో మట్టా మధు, మల్ల గణేశ్, మల్ల సాయి, మిడత శ్రీను, సింహాద్రి సాయి, సాంబ, పానుగంటి గణేశ్, మల్ల అంజిబాబు, సురేందర్‌నాయక్, బోగం రామకృష్ణ, మురికి శ్రీను తదితరులు ఉన్నారు.

వైభవంగా రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం, అక్టోబర్ 31 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణం జరిపి, దాతలకు ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

కల్లూరు, ఇల్లెందుల్లో..

ఉమ్మడి జిల్లాకు నేడు గులాబీ బాస్

నేడు ప్రజా ఆశీర్వాద సభలు

- హాజరుకానున్న బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్
- రెండు సభల విజయవంతంపై దృష్టి సారించిన పార్టీ నేతలు
- సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్
- పర్యవేక్షించిన పార్థసారథిరెడ్డి, వద్దిరాజు, కవిత, తాతా మధు
- జన సమీకరణపై ఎమ్మెల్యేలు సండ్ర, హరిప్రియానాయక్ దృష్టి
- మూడోసారీ కేసీఆరే ముఖ్యమంత్రి: తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర

ఖమ్మం, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కల్లూరులో, 2 గంటలకు ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ నెల 27న ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో తొలి ఎన్నికల ప్రచార సభ విజయవంతం కావడంతో శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఇదే జోష్‌తో సత్తుపల్లి సభకు భారీ జనసమీకరణపై అక్కడి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య దృష్టి సారించారు. సుమారు లక్ష మంది ప్రజలు హాజరయ్యేలా విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ఏర్పాట్లను మంగళవారం రాజ్యసభ సభ్యుడు, సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి బండి పార్థసారథిరెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యుడు సండ్ర వెంకట వీరయ్య, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పరిశీలించారు.

కల్లూరులో సిద్ధమైన సభా స్థలం

సీఎం సభకు పోలీసు యంత్రాగం కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌లో హెలీకాప్టర్‌లో బయలుదేరే సీఎం కేసీఆర్.. నేరుగా కల్లూరుకు చేరుకుంటారు. అనంతరం అక్కడి సభలో నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

మధ్యాహ్నం 2 గంటలకు ఇల్లెందుకు..

కల్లూరులో సభ పూర్తికాగానే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధ్యాహ్నం 2 గంటలకు ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెంలో ఏర్పాటు చేసిన సభాస్థలికి సీఎం చేరుకుంటారు. అక్కడి సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ ఇల్లెందులో తొలి ప్రచార సభలో పాల్గొననున్నారు. సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పరిశీలించారు. ఎంపీ రవిచంద్ర సభా ఏర్పాట్లను, సెక్టార్లను పరిశీలించారు. కాగా, బుధవారం నాటి సీఎం పర్యటనతో ఉమ్మడి జిల్లాలో వారం రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడు నియోజకవర్గాల్లో పర్యటించినట్లవుతుంది. అలాగే, ఈ నెల 5న కొత్తగూడెం, ఖమ్మం నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి పాల్గొననున్నారు.

సత్తుపల్లి ప్రజలు బీఆర్ఎస్‌నే గెలిపిస్తారు: ఎమ్మెల్యే సండ్ర

కల్లూరులో సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సత్తుపల్లి నియోజకవర్గానికి దళితబంధు పూర్తిస్థాయిలో ఇవ్వడం, లబ్ధిదారులకు ఎంపిక సైతం పూర్తికావడం హర్షణీయమని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించి తీరుతామని ముఖ్యమంత్రికి మాట ఇచ్చేందుకే ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలిరానున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఇప్పటివరకు అభ్యర్థినే ప్రకటించని కాంగ్రెస్ పార్టీ అయోమయంలో ఉందని విమర్శించారు.

రికార్డుస్థాయి మెజార్టీ సాధించాలి

- పినపాక నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండానే..
- మణుగూరు ప్రచారంలో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు
- వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి 160 కుటుంబాలు

గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 31: పినపాక నియోజకవర్గంలో ఎగిరేది గులాబీ జెండాయేనని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ అభ్యర్థి రేగా కాంతారావు స్పష్టం చేశారు. రికార్డు స్థాయి మెజార్టీ సాధించాలని, ఇందుకోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. మణుగూరు మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించిన ఆయన.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం రూపొందించినదేనని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి కూడా ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. కాగా, మండలంలోని ఆదర్శనగర్, చేపలమార్కెట్ ఏరియా, గోల్డ్‌షాప్‌లైన్ రామాలయం ఏరియాల్లోని వివిధ పార్టీలకు చెందిన 160 కుటుంబాల వారు ప్రభుత్వ విప్ రేగా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ యకులు నవీన్‌కుమార్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, పాయం ప్రవీణ్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

'రేగా'ను నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్ని..

బీఆర్ఎస్ నాయకుడు, పినపాక నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కోనేరు సత్యనారాయణ (చిన్ని) మంగళవారం మణుగూరుకు చేరుకొని ప్రభుత్వ విప్ రేగా కాంతారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధినేత కేసీఆర్ చేసిన సూచనలు, మ్యానిఫెస్టో, ఎన్నికల ప్రచారం వంటి అంశాలపై చర్చించారు. అనంతరం కోనేరు సత్యనారాయణ (చిన్ని)ను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు శాలువాతో సన్మానించారు. జడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ నాయకులు అడపా అప్పారావు, కుర్రి నాగేశ్వరరావు, వట్టం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో ఎన్నికల ప్రచారం అంశంపై చర్చిస్తున్న రేగా, కోనేరు చిన్ని

పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ షాక్

మణుగూరు భగత్‌సింగ్‌నగర్‌లో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో విప్ రేగా

మణుగూరు టౌన్, అక్టోబర్ 31: పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. మండలంలోని భగత్‌సింగ్‌నగర్, గోల్డ్‌షాప్‌లైన్ రామాలయం ప్రాంతాల నుంచి కాంగ్రెస్‌కు చెందిన సుమారు 200 కుటుంబాల వారు పాయం ప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ రేగా సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ చేరారు. నాయకులు నవీన్‌కుమార్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, పాయం గోపాల్, సోలం శ్రీనివాస్, రషీద్, సోలం జలందర్, సోలం శ్రీను, పాయం చిట్టి, వాగబోయిన నాగేశ్వరరావు, సోలం రమణ, సోలం సాయమ్మ, సోలం సోమమ్మ, జోలం జ్యోతి, వాగబోయిన పద్మ, వాగబోయిన రమణ పాల్గొన్నారు.